పురపాలక ఆదాయానికి గండి

- లీజు కేటాయింపుల్లో ఇష్టారాజ్యం
- అద్దె వసూళ్లలో వైఫల్యం
- ఇదీ పొన్నూరు మున్సిపాలిటీ అధికారుల తీరు

పొన్నూరు: మున్సిపల్ దుకాణాలు, దినసరి మార్కెట్ దుకాణాల లీజు కేటాయింపుల్లో ఇష్టారాజ్యం.. ఏళ్ల తరబడి పేరుకుపోయిన అద్దె బకాయిల వసూళ్లలో వైఫల్యం.. ఇదీ పొన్నూరు మున్సిపాలిటీ అధికారుల తీరు. పొన్నూరు మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో అధికార యంత్రాంగం వున్నా ఆదాయ మార్గాలపై దృష్టి సారించలేక పోతుంది. వచ్చే కొద్దిపాటి ఆదాయంతో అభివృద్ధి పనులు చేపట్టడం సాధ్యపడక ప్రజలకు అత్యవసరమైన సేవలు అందించడంలో విఫలమవుతోంది. దీంతో అధికారులు పట్టణాభివృద్ధికి చేపడుతున్న ప్రణాళికలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. పురపాలక ఆదాయాన్ని పెంచుకోవడంలో అధికారులు వెనుకబడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ దుకాణాలు, నిబంధనల ప్రకారం దినసరి మార్కెట్ లీజు కేటాయింపులు, అద్దె వసూళ్లపై శ్రద్ధ చూపించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో అధికార యంత్రాంగం ఉన్నా అభివృద్ధిపై శ్రద్ధ చూపడంలేదు. ఆస్తి పన్నుల ద్వారా వస్తున్న ఆదాయం విద్యుత్తు చార్జీలు, సిబ్బంది జీతాలకే సరిపోతోంది. కాగా పారిశుద్ధ్య పనులకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసేందుకు నిధులు చాలడంలేదు. ఇక తాగునీటి సరఫరాకు సంబంధించి పరికరాలను కొనుగోలు చేయడానికి సైతం నిధుల కొరత వెంటాడుతోంది.



పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్

లీజుదారులకు ఒకలా.. సామాన్యులకు మరోలా..

పట్టణ పరిధిలోని నాలుగు మున్సిపల్ కాంప్లెక్స్‌ల ద్వారా అద్దెల రూపంలో ఏటా సుమారు రూ. కోటి వరకు ఆదాయం సమకూరుతోందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఆస్తి పన్నుల ద్వారా రూ.5.74 కోట్లు, దినసరి మార్కెట్‌ల వేలం ద్వారా రూ. లక్షలు ఆదాయం సమకూరుతోంది. అయితే మున్సిపల్ అధికారులు ఇంటి పన్ను వసూళ్లలో చూపిస్తున్న శ్రద్ధ దుకాణ లీజుదారులపై చూపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్ను చెల్లించని వారి ఇళ్లకు కుళాయిలు, తొలగించి నీటి సరఫరాను నిలిపి వేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. ఈరకంగా సామాన్య ప్రజల నుంచి పన్నులు ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్నారు గానీ దుకాణదారుల నుంచి అద్దె వసూళ్లలో మాత్రం అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. రూ. లక్షలు బకాయిలు ఉన్నా చూసీ చూడనట్లు వదిలేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. రూ. వందల బకాయి ఉన్న సామాన్య ప్రజలకు ఒక న్యాయం, రూ. లక్షలు బకాయిలు ఉన్న దుకాణ లీజుదారులకు ఒక న్యాయమా అంటూ అధికారుల పనితీరును ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఐలాండ్ సెంటర్‌లోని ఓ కాంప్లెక్స్‌లోని షాపులకు ఏళ్ల తరబడి అద్దె బకాయిలు ఉన్నా మున్సిపల్ రెవెన్యూ విభాగం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. పెండింగ్ బకాయిలపై పట్ల పట్టీపట్టనట్లు వ్యవహరించడం .. ఆదాయ పెంపుపై పర్యవేక్షణ కొరవడటంతో మున్సిపాలిటీ ఆదాయాన్ని కోల్పోతుంది.

లీజు కేటాయింపుల్లో ఇష్టారాజ్యం

దినసరి మార్కెట్ లీజు కేటాయింపుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గతంలో ఏటా రూ. లక్షల్లో ఆదాయం సమకూరే మార్కెట్ లీజులు, పలు దుకాణాలను కొందరికి నామమాత్రపు ధరలకే కేటాయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా నష్టం వాటిల్లుతుంది.

అద్దెల భారం.. తెరుచుకోని దుకాణాలు

పట్టణ ప్రధాన సెంటర్లలోని మున్సిపల్ దుకాణాలకు డిమాండ్ ఉంది. కానీ లీజుదారులకు కావలసిన సౌకర్యాలు కల్పించడం లేదనే విమర్శలు లేకపోలేదు. వ్యాపారాలకు అనుగుణంగా అద్దెలను నిర్ణయించి కేటాయించడం లేదు. బహిరంగ వేలంలో పాల్గొని తీవ్ర పోటీ సృష్టించడంతో అధిక మొత్తంలో (రూ.సుమారు 30వేల నుంచి 40వేలు) చెల్లించి దుకాణాలను దక్కించుకున్న వారు అద్దెల భారంతో కొన్ని నెలలకే నష్టపోవాల్సి వస్తుంది. మరికొందరు తెరవకుండానే దుకాణాలను వదులుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది. దీంతో నెలల తరబడి దుకాణాలు మూతబడే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ కూడా ఆదాయాన్ని కోల్పోతుంది.

క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో 60 కేసులకు పరిష్కారం



పొన్నూరు: పట్టణంలోని సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 60 కేసులు పరిష్కరించినట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి ఏకా పవన్‌కుమార్ తెలిపారు. సివిల్ కేసులు 6, అమలు పిటిషన్ 1, మనోవర్తి 4, క్రిమినల్ 37, ఎక్సైజ్ 9, చెక్ బౌన్స్ కేసులు 3 పరిష్కారం అయ్యాయని పేర్కొన్నారు. ఈ కేసుల్లో కక్షిదారులకు రూ. 78,98,500 పరిహారం కింద అందించినట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీసాహెబ్, మగ్బుల్ బేగ్ లోక్ అదాలత్ మెంబరుగా వ్యవహరించారు. న్యాయవాదులు పి.జయరాజ్, ఎం.ఈరేష్, మున్సిపల్ స్టాండింగ్ కమిటీ న్యాయవాది టి.రమేష్, ఎస్.కృష్ణ, సదానందరావు, పి.విజయ్‌కుమార్, న్యాయవాద గుమస్తాలు, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ ప్రోగ్రామర్స్ దినోత్సవం



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలోగల సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శనివారం కంప్యూటర్ ప్రోగ్రామర్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ డాక్టర్ టి.సంధ్య మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌డేట్ చేసుకోవాలన్నారు. సాంకేతిక ప్రాముఖ్యత, భవిష్యత్‌లో సాంకేతిక పరిజ్ఞానం వల్ల కలిగే అవకాశాలు, లాభాలు వివరించారు. పీజీ కోర్స్ డైరెక్టర్ డాక్టర్ జె.ప్రతాప్‌రెడ్డి, ఎంసీఏ విభాగాధిపతి ఎం.ఉషారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబును ఇటీవల నూతనంగా పార్టీలో పదవులు పొందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్ధార్థ నగర్‌లోని ఆయన కార్యాలయంలో పార్టీ మహిళ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన భుక్యా శాలిని, పశ్చిమ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన కానూరు శ్రీధర్ పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ మహిళ, యువజన విభాగాలు పార్టీకి ఎంతో ముఖ్యమన్నారు. భవిష్యత్‌లో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసే దిశగా పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు బొక్క అగస్టీన్, యువజన విభాగం నాయకులు పులివర్తి మణిధర్, రూపేష్, సంతోష్, సతీష్, గోపి, గణేష్, జాన్సన్, వీరయ్య పాల్గొన్నారు.

పిడుగు పాటు బాధితులను ఆదుకోవాలి

లక్ష్మీపురం: గుంటూరు జిల్లా వ్యాప్తంగా శనివారం కురిసిన భారీ వర్షాలకు పిడుగులు పడి మృతి చెందిన రైతు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా కింద రూ.5 లక్షలు ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిలా కార్యదర్శి ఈమని అప్పారావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు పిడుగులు పడి పెదనందిపాడు మండలం అన్నవరం, పెదకాకాని మండలం నంబూరులో వ్యవసాయ కూలీలు చనిపోవడం జరిగిందని తెలిపారు. కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ఇచ్చి ఆ కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని కోరారు.

డిజిటల్ మహిళా సంస్థ ఆవిర్భావం

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని మహిళలు తమ ఇంట్లో నుంచే వారిలోని నైపుణ్యానికి తగిన విధంగా శక్తి, సంపద, స్వేచ్ఛను సాధించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా డిజిటల్ మహిళా అనే సంస్థను ఏర్పాటు చేశారు. శనివారం బ్రాడీపేటలోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ఆశ్లేష ఈదల మాట్లాడుతూ గృహిణులుగా ఇంటిని, కుటుంబాన్ని తీర్చిదిద్దే మహిళలు తమ ఇంటి నుంచే ఆదాయాన్ని సంపాదించడంపై అవగాహన కల్పించేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లా డిజిటల్ మహిళా అనే సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఎంఎస్ భవిత పేరుతో యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో సంస్థ అధిష్టాన్ సభ్యులుగా దేవీరెడ్డి, పూర్వజ, నాగశ్రీ, వాణి పోలూరి, మాధవితో పాటు సంఘ మిత్ర సభ్యులుగా మరో 55 మందిని చేర్పించారు.

ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలి

గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామంలో చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన తురకపాలెంలో పర్యటించి, మృతుల కుటుంబాలను పరామర్శించారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల సాధన

సీఐటీయూ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పంతగాని ధనలక్ష్మి



నినాదాలు చేస్తున్న పంతగాని ధనలక్ష్మి, ఆశా కార్యకర్తలు

ప్రత్తిపాడు: ఐక్య పోరాటాలతో కలిసి కట్టుగా ముందుకు సాగి, గళం వినిపిస్తేనే కనీస వేతనాన్ని సాధించుకోగలమని సీఐటీయూ ఆశా వర్కర్స్ యూనియన్ గుంటూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పంతగాని ధనలక్ష్మి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో శనివారం మండల ఆశా వర్కర్స్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షురాలు సరోజిని అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధనలక్ష్మి హాజరయ్యారు. తొలుత అనారోగ్యంతో మృతి చెందిన చేబ్రోలు ఆశా వర్కర్ ఇంటూరి సులోచన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ జీఓ నంబర్ 94 ప్రకారం మృతి చెందిన ఆశా కార్యకర్తకు వెంటనే గ్రాట్యుటీ మంజూరు చేయడంతో పాటు, మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. అంతేకాకుండా వారి కుటుంబంలో అర్హులైన వారికి ఆశావర్కర్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆరోగ్య సేవలందించే ఆశా కార్యకర్తలు, వారికి అనారోగ్య సమస్యలు తలెత్తితే కనీసం సెలవులు కూడా లభించని పరిస్థితులు ఉన్నాయన్నారు. అందుచేత ఆశా కార్యకర్తలకు వారాంతపు సెలవులు, మెడికల్ లీవ్‌లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం వైజాగ్‌లో సీఐటీయూ జాతీయ మహాసభలు జరగనున్న నేపథ్యంలో స్వచ్ఛంధ విరాళాలు ఇవ్వాలని ఆశా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల సమన్వయ కమిటీ అధ్యక్షురాలు కాకర్లమూడి జ్యోతి, ప్రత్తిపాడు కో-లొకేటెడ్ ఆశా కార్యకర్తలు ప్రమీలళ, మహాలక్ష్మి, బాలాంకమ్మ, వెంకాయమ్మ, ఏసు మరియమ్మ, సరిత, సిరాజ్, షకీలా, మహాలక్ష్మి, నిరోషా, లక్ష్మీ తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం

మలినేని కళాశాలల చైర్మన్ మలినేని పెరుమాళ్లు



సాంకేతిక పోటీల్లో వైర్‌లెస్ టెక్నాలజీపై వివరిస్తున్న విద్యార్థినులు

ప్రత్తిపాడు: దేశ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని మలినేని కళాశాలల చైర్మన్ మలినేని పెరుమాళ్లు అన్నారు. ఈ నెల 15న భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా నిర్వహించనున్న ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ - మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ - డేటా సైన్స్ మరియు అనుబంధ విభాగాల విద్యార్థులకు సాంకేతిక పోటీలను నిర్వహించారు. సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం, టెక్నాలజీ ప్రాముఖ్యత.. వంటి పలు అంశాలపై జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ పారిశ్రామిక, విద్య, టెక్నాలజీ రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులకు ఇంజినీర్లే కారణభూతులని తెలిపారు. విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని నైపుణ్యం పెంపొందించుకున్నప్పుడే తమ భవిష్యత్తు ప్రకాశవంతమవుతుంది అని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కళాశాల డైరెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల సాంకేతిక ప్రతిభను పెంపొందించుకోవాలన్నారు. పోటీల్లో విజేతలకు ఇంజినీర్స్‌డే రోజు బహుమతులు అందించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్‌లు, ఆయా విభాగాల హెచ్‌వోడీలు రామస్వామి, రవికిరణ్, హరికృష్ణ, జయరావు, సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా 'మలినేని మైక్స్ అండ్ మైండ్స్'

వేడుకల్లో మలినేని కళాశాల ఏఐ అండ్ ఎంఎల్ విద్యార్థులు నిర్వహించిన 'మలినేని మైక్స్ అండ్ మైండ్స్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ - మెషిన్ లెర్నింగ్ విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు స్పీచ్ రికగ్నిషన్ టెక్నాలజీని వాస్తవ జీవితంలో ఎలా ఉపయోగించాలో వివరించారు. ప్రధానంగా యాక్టివ్ వాయిస్ మరియు ఫేక్ వాయిస్ మధ్య తేడాను ఎలా గుర్తించాలన్న అంశాలపై చేసిన పరిశోధనలను వివరించారు. వాటి ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు.

'సెయింట్ మేరీస్'లో గ్రాడ్యుయేషన్ డే



గుంటూరు రూరల్: నగర శివారు బుడంపాడు సమీపంలోని సెయింట్ మేరీస్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా జరిపారు. పూర్వ విద్యార్థినులు వారి మిత్రులు, అధ్యాపకుల సమక్షంలో స్నాతకోత్సవాన్ని ఆనందంగా జరుపుకొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ డాక్టర్ కేవీకే రావు, కళాశాల ప్రెసిడెంట్ భారతి దేవిలు విచ్చేసి విద్యార్థినులకు సర్టిఫికెట్స్ అందచేశారు. అనంతరం డాక్టర్ కేవీకే రావు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల, కళాశాల యెడల కృతజ్ఞత కలిగి ఉండాలన్నారు. మీరు సంపాదించుకున్న విజ్ఞానం సమాజ అభివృద్ధికి దోహదపడుతూ దేశాన్ని ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రెసిడెంట్ భారతిదేవి మాట్లాడుతూ అన్నిరంగాల్లో మహిళా సాధికారత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కల్పనా చావ్లా, సుధామూర్తిలను ఉదాహరణగా చెప్పి అందరు అలా జీవితంలో ముందుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డేవిడ్ సోలమన్‌రాజు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, అకాడమిక్ డీన్ డాక్టర్ రూపేష్ కుమార్, క్యాంపస్ ఇంచార్జి అశోక్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని పూర్వ విద్యార్థినులను అభినందించారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ

పెదకాకాని: కూలి పనులకు వెళ్లిన వారు పిడుగుపడి మరణించడం బాధాకరమని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. మండలంలోని నంబూరు గ్రామంలో శనివారం పిడుగు పాటుకు మరణించిన దాసరి రాణి, దాసరి శారమ్మల కుటుంబాలను సీపీఎం నాయకులు సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలు పొలం పనులకు వెళ్లి పిడుగు పడి మృతి చెందారని, వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. అలానే పిడుగుపాటుకు అనారోగ్యానికి గురైన వారికి మెరుగైన చికిత్స అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు బి.బాబూరావు, ఎం.శ్రీనివాసరావు, కె.ఆదం తదితరులు పాల్గొన్నారు.

'చిప్స్ ఫార్మసీ'లో పీసీఐ నూతన సిలబస్‌పై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాధర

గుంటూరు రూరల్: మండలంలోని చౌడవరం గ్రామంలోగల చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో శనివారం కళాశాల ఏపీటీఐ, ఐపీఏ, ఐపీఏ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టనున్న నూతన సిలబస్‌పై ప్రతిస్పందన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర మాట్లాడుతూ నూతన సిలబస్ మార్పులు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. డిగ్రీ స్థాయిలో సిలబస్ పునర్‌వ్యవస్థీకరణ ద్వారా విద్యార్థులకు ఆధునిక కోర్సులపై అవగాహన పెరుగుతుందన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కోర్సు రూపకల్పన చేయడం వల్ల, విద్యార్థులు ప్రాక్టికల్ స్కిల్స్, పరిశ్రమ-ఆధారిత శిక్షణ, ఆరోగ్య పరిరక్షణ, క్లినికల్ సేవలలో మెరుగైన అవకాశాలను పొందగలుగుతారని చెప్పారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు నిరంజన్ మాట్లాడుతూ నూతన సిలబస్ ద్వారా విద్యార్థులు మారుతున్న ఫార్మసీ వాతావరణానికి తగిన విధంగా స్పందించగలుగుతారన్నారు. దేశీయ ఫార్మా పరిశ్రమలకు నైపుణ్యంతో కూడిన మానవ వనరులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఏపీటీఐ ప్రెసిడెంట్ రమణ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు కూడా పరిస్థితులకు అనుగుణంగా, నూతన టెక్నాలజీస్ నేర్చుకొంటూ, విద్యార్థులకు తెలియచేస్తూ ముందుకు నడవాలని తెలిపారు. డాక్టర్ అంకమ్మ చౌదరి, ప్రొఫెసర్ నాగరాజు, డాక్టర్ శ్రీనివాసుబాబు ముసాయిదాలో చేయవలసిన మార్పులు చేర్పుల గురించి సూచనలు సలహాలను అందజేశారు. ఫార్మసీ విద్యారంగంలో విద్యార్థుల ప్రయోజనార్థమై ఈ విధమైన అవగాహన కార్యక్రమ రూపకల్పనలో కృషి చేసిన తమ కళాశాల అధ్యాపకులు, అవగాహన కార్యక్రమానికి విచ్చేసి న వివిధ ఫార్మసీ విద్యారంగ ప్రతినిధులకు చిప్స్ కళాశాల యాజమాన్యం అభినందనలను తెలిపారు. కార్యక్రమంలో గోపాల కృష్ణ మూర్తి, ప్రిన్సిపాల్ పద్మలత, వివిధ కళాశాల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. అస్తవ్యస్తం



చేబ్రోలు మండలం శలపాడులో భారీ వర్షంతో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షం నీరు



చేబ్రోలు నరాలశెట్టిపాలెంలో వర్షం నీటితో అధ్వానంగా ఉన్న రహదారి



పెదకాకాని శివాలయం రోడ్డులో చేరిన వర్షం నీరు

రహదారులు జలమయం

పెదకాకాని: మండలంలో కుండపోత వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపైకి అధికంగా వర్షంనీరు వచ్చి చేరడంతో వాహనదారులు, ప్రజలు అసౌకర్యానికి గురయ్యాయి. ఆకాశం కారుమబ్బులు కమ్మి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గంటపాటు కుండపోటు వర్షం కురవడంతో పలు కాలనీల్లోని ఇళ్లలోకి వర్షం నీరు వచ్చి చేరింది.

పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామం నుంచి అగతవరప్పాడు గ్రామానికి వెళ్లే రోడ్డుపై నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలానే పెదకాకాని శివాలయం రోడ్డుపైకి వర్షం నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా పెదకాకాని సెంటర్ నుంచి వెనిగండ్ల వైపు వెళ్లే రోడ్డుపైకి వర్షపునీటితో పాటు అపార్ట్‌మెంట్స్ ఎదురుగా ఉన్న మురుగుకాలువల నుంచి మురుగునీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. ఆ మురుగునీటిలోనే వాహనాల రాకపోకలు కొనసాగాయి.



వెనిగండ్ల అగతవరప్పాడు గ్రామాల మధ్య జలమయంగా మారిన రహదారి

లోతట్టు ప్రాంతాలు జలమయం

చేబ్రోలు: చేబ్రోలు మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చేబ్రోలు, శలపాడు, వడ్లమూడి తదితర గ్రామాల్లోని వర్షపు నీరు రహదారులపై ప్రవహించాయి. డ్రెయిన్లు సక్రమంగా లేకపోవటంతో పల్లపు ప్రాంతాల్లో నీరు చేరి తటాకాలను తలపించాయి. శలపాడు గ్రామంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోకి వర్షంనీరు చేరి చెరువులాగా దర్శనమిచ్చింది. శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు





ప్రమాదంలో గాయపడిన చాంద్‌బాషా, అతని భార్య

ఘటనలో నెల్లూరుకు చెందిన భార్యాభర్తలకు గాయాలు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలైన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా నెల్లూరుకు చెందిన చాంద్‌బాషా తన భార్య, కుమారుడితో కలిసి విజయవాడలోని ఓ కళాశాలలో తన కుమారుడి సీటుకోసం మాట్లాడేందుకు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో గుంటూరు నగర శివార్లలోని వై.జంక్షన్ సమీపంలో హైవేపై రోడ్డుపక్కన నిలిపివున్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో చాంద్‌బాషాకు, అతని భార్యకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి ఇరువురిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు ఇరువురి పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లపాడు పోలీసులు తెలిపారు.

గుంటూరు నగర అభివృద్ధిపై సమీక్ష

నెహ్రూనగర్: నగర అభివృద్ధిపై మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణతో పాటు గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, నగర కమిషనర్ పులి శ్రీనివాసులతో కలిసి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కుంచనపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో సమావేశమయ్యారు. రూ.120 కోట్లతో ఇన్నర్ రింగ్ రోడ్డు అసంపూర్తి పనులు, స్టాం వాటర్ డ్రెయిన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. గోరంట్ల ట్యాంక్ నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు అమృత్ 2.0 టెండర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సీఆర్‌డీఏ ఇంజినీరింగ్ చీఫ్ కృష్ణారెడ్డి, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇస్తామని చెప్పిన హామీలను నెరవేర్చాలని కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.సుమన్ డిమాండ్ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో సమావేశం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈదులమూడి మధుబాబు అధ్యక్షత శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మేలు జరుగుతుందని ఆశించినప్పటికి ఎటువంటి ఫలితం లేదన్నారు. ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల హామి ఇచ్చినప్పటికి దానిని ఇంత వరకు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ముఖ్య నాయకులు సంగీతరావు, కిరణ్‌కుమార్, శ్యాంప్రసాద్, శివసైదారావు, గంట సంపత్‌కుమార్, సుధీర్‌కుమార్, రామ్‌భద్ర, నీరజ, కోటేశ్వరరావు, ఎం.నాగరాజు పాల్గొన్నారు.